ఆఖరి మజిలీకీ అవస్థలే

- డంపింగ్ యార్డులా సిద్ధాంతం శ్మశానవాటిక
- పట్టించుకోని అధికారులు



దక్షిణ కాశీగా పేరు గాంచిన సిద్ధాంతం శ్మశానవాటిక దుస్థితి

పెనుగొండ: అక్కడ అంతిమ సంస్కారం చేస్తే కాశీలో చేసినంత పుణ్యమని పెద్దు చెబుతూ ఉంటారు. కానీ ప్రస్తుతం అక్కడ అంతిమ సంస్కారం చేయడానికి ముక్కు మూసుకుని ని శివ.. శివా అనేలా పరిస్థితి తయారైంది. దక్షిణ కాశీగా పేరు గాంచిన సిద్ధాంతంలోని కేదారీఘాట్ శ్మశానవాటిక సిద్ధాంతం డంపింగ్ యార్డుగా మారిపోయింది. అంతిమ సంస్కారం అనంతరం నిర్వహించే పిండ ప్రధానానికి పుష్కరాల్లో నిర్మించిన పిండ ప్రధాన రేవు అస్తవ్యస్తంగా తయారైంది. శ్మశానం చుట్టూ పేరుకు పోయిన చెత్తాచెదారాలతో దుర్గంధం వ్యాపిస్తుంటే ముక్కుమూసుకుని మరీ దహన సంస్కారం పూర్తయ్యే వరకూ వేచి ఉంటున్నారు. ఈ శ్మశానవాటికలో రోజూ మూడు నుంచి నాలుగుకు పైగా దహన సంస్కారాలు జరుగుతూ ఉంటాయి. అయితే ఎన్ని రోజులు గడిచినా 'దక్షిణ కాశీగా పేరు పొందిన సిద్ధాంతం శ్మశాన వాటిక అభివృద్ధికి మోక్షం కలుగడం లేదు.

మౌలిక సదుపాయాల లేమి

సిద్ధాంతం వశిష్టా గోదావరి తీరంలో కేదారేశ్వరుడు కొలువై ఉండడంతో ప్రవిత్ర కేదారీఘాట్‌తో దక్షిణ కాశీగా పేరు పొందింది. దీంతో పెనుగొండ, పెనుమంట్ర, ఆచంట, తణుకు, అత్తిలి, ఇరగవరం, పెరవలి మండలాలనుంచి అంత్యక్రియలు నిర్వహించడానికి సిద్ధాంతం శ్మశాన వాటికకు తరలి వస్తుంటారు. నిత్యం పరిసర ప్రాంతాలనుంచి వచ్చిన వారితో నిత్యం శవ దహనం జరుగుతుంటుంది. దీనికి అనుగుణమైన సదుపాయాలు లేక నానా అవస్థలు పడతున్నారు. 20 ఏళ్లుగా శ్మశాన వాటిక అభివృద్ధికి ప్రయత్నాలు చేస్తున్నా అడుగు ముందుకు పడడం లేదు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆనాటి మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజును శ్మశానవాటిక అభివృద్ధిని పట్టాలెక్కించారు. అయితే మహమ్మారి కరోనాతో తిరిగి నిలిచిపోయాయి. 2022లో ప్రభుత్వ నిధులు, స్థానిక దాతల భాగస్వామ్యంతో శ్మశాన వాటికను రాజమండ్రికి కై లాస వనానికి దీటుగా తీర్చిదిద్దాలని ప్రయత్నాలు చేశారు. స్థానికులతో సమావేశం నిర్వహించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కొంత మేర సొంత నిధులు సమకూర్చి, ప్రభుత్వ నిధులతో కలిపి 2023లో పనులు ప్రారంభించారు. 2024లో ఎన్నికల కోడ్ రావడంతో ఎక్కడ పనులు అక్కడ నిలిచిపోయాయి. నేటి వరకూ పనులు అడుగు ముందుకు పడలేదు. ఇటీవల రెండు మూడు సమావేశాలు నిర్వహించినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా సిద్ధాంతం శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

డంపింగ్ నిలపాలి

సిద్ధాంతం పంచాయతీ శ్మశానవాటికను డంపింగ్ యార్డుగా వినియోగించుకుంటుంది. దీని వల్ల దహనసంస్కారాలు చేయడం కష్టసాధ్యంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్గంధం మధ్య అంతిమసంస్కారం చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి శ్మశానవాటికను డంపింగ్ యార్డుగా వినియోగించడం విరమించుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



శ్మశానవాటిక వద్ద పేరుకుపోయిన చెత్త



మధ్యలోని నిలిచిన శ్మశానవాటిక అభివృద్ధి పనులు

క్లుప్తంగా

నేడు పోడూరు మండల వైఎస్సార్ సీపీ సమావేశం

పాలకొల్లు సెంట్రల్: నియోజకవర్గంలోని పోడూరు మండలం కొమ్ముచిక్కాల గ్రామంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలో నియోజకవర్గ ఇంచార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు అధ్యక్షతన వైఎస్సార్ సీపీ విస్తృస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పోడూరు మండల కమిటీ అధ్యక్షుడు కొర్రపాటి వీరాస్వామి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కొమ్ము చిక్కాలలోని జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరిపెద్దిరాజు షెడ్, సాయిబాబా గుడివద్ద బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళా నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

నడిపూడిలో నాగపంచమి వేడుకలు



నాగపంచమి వేడుకలు నిర్వహిస్తున్న భక్తులు

పెనుగొండ: మండలంలోని నడిపూడి స్వయంభూః వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో మంగళవారం నాగపంచమి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి అర్చనలు, పంచామృతాభిషేకాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహిక నవగ్రహ కల్ప పూర్వక లక్షపత్రి పూజ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. వేదపండితులతో కలిసి ఆలయ అర్చకుడు పవన్‌కుమార్ శర్మ పూజలు అభిషేకాలు నిర్వహించగా, కార్యనిర్వహణాధికారి ఆర్‌వీవీఎస్ రామచంద్రకుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా సినారె జయంతి

పాలకొల్లు సెంట్రల్: జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సింగిరెడ్డి నారాయణరెడ్డి (సినారె) వ్యక్తి కాదని సామూహిక శక్తితో కూడిన సాహితీ మహోన్నత శిఖరమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తిరువీధుల రాజరాజేశ్వరి అన్నారు. మంగళవారం సినారే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరి మాట్లాడుతూ తెలుగు సాహిత్యం ద్వారా సమాజంలో మానవతా విలువలు నెలకొల్పడానికి తాపత్రయపడిన మహనీయుడని అన్నారు. నిత్యం కవితాక్షరాలతో తెలుగు తల్లి మెడలో కావ్యహారాలను అలంకరించారని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, తెలుగు విభాగాధిపతి బూసి వెంకటస్వామి, ఐక్యూ కోఆర్డినేటర్ కె.భద్రాచలం, వి.యామిని, ఎం.రామకృష్ణ, ఎన్‌వీడీ దినకరన్, సీహెచ్ ఉషారాణి, వి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

రేపు యలమంచిలి మండల పరిషత్ సమావేశం

యలమంచిలి: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ ఇనుకొండ ధనలక్ష్మీ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో గత మూడు నెలలుగా మండలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను వివరించడంతో పాటు, రాబోయే మూడునెలల కాలంలో చేపట్టే పనులపై సమీక్ష చేస్తారని పేర్కొన్నారు. మండల పరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

ప్రతి ఒక్కరూ నైతిక విలువలతో ఉండాలి



ఉమామహేశ్వరరావును సత్కరిస్తున్న సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులకు చిన్నతనం నుంచే నైతిక విలువలను నేర్పించాల్సిన భాధ్యత గురువులతో పాటు తల్లిదండ్రులకు ఉందని అష్టావధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం రాత్రి ఉల్లంపర్రులో నిర్వహించిన అష్టావదాన కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు భాష చాలా గొప్పదని అలాంటి తెలుగు బాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి, దాయన సురేష్ చంద్రజీ, అంగర మానస, చల్లా అన్నపూర్ణేశ్వరరావు, వీవీఎస్ఎన్ రాజు, పెన్మెత్స సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

ప్రియుడిపై ప్రియురాలి ఫిర్యాదు

యలమంచిలి: ప్రేమిస్తున్నాని చెప్పి తన వాంఛ తీర్చుకుని ఇప్పుడు పెళ్లికి నిరాకరిస్తున్నాడని ప్రియుడిపై ప్రియురాలు మంగళవారం ఫిర్యాదు చేసింది. వివరాలప్రకారం కట్టుపాలెం గ్రామానికి చెందిన ఓ యువతి అబ్బిరాజుపాలెం గ్రామానికి చెందిన చింతా సాయి దుర్గాప్రసాద్ (20) మోసం చేశాడని పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.గుర్రయ్య తెలిపారు.

పేదలను మోసం చేసిన ఘనత చంద్రబాబుదే



తూర్పుపాలెంలో పోడూరు మండల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు పెద్దిరాజు

పెనుగొండ: సంక్షేమ రెట్టింపంటూ, సూపర్ సిక్స్ పథకంతో భవిష్యత్‌ను మారుస్తానంటూ చంద్రబాబు పేదలను మభ్య పెట్టి మోసం చేశారని పోడూరు మండల జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరిపెద్దిరాజు విమర్శించారు. మంగళవారం తూర్పుపాలెంలోని వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో మాజీమంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాల మేరకు నిర్విహించిన బాబూ షూరిటీ మోసం గ్యారెంటీ పోడూరు మండల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. కూటమి అధికారంలోకి రావడం కోసం మోసపూరిత హామీలు ఇచ్చాన్నారు. నేడు వాటిని అమలు చేయడం మాని కక్షపూరిత పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. దీనిని ఎండగట్టి పేద ప్రజలు అండగా ఉండాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ప్రతి కార్యకర్తా పేదలకు అండగా నిలవాలన్నారు. 2029 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. దీనికి అనుగుణంగా కార్యకర్తలు ఐక్యంతో ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా వెనుకడుగు వేయవద్దన్నారు. ప్రతి ఒక్కరికీ స్థానిక నాయకత్వం నుంచి జగన్‌మోహన్‌రెడ్డి వరకూ అండగా నిలుస్తారన్నారు. ఆచంటలో చెరుకువాడ శ్రీరంగనాథరాజు విజయం సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సబ్బితి సుమంగళి, మండల కన్వీనరు పిల్లి నాగన్న, పార్టీ నాయకులు పోతుమూడి రామచంద్రరావు, గుబ్బల వీర బ్రహ్మం, గుడాల చంటి, విప్పర్తి ప్రభాకర్, చెట్టిబత్తుల సువర్ణరాజు, గొట్టుముక్కల సునీల్ వర్మ, కంచర్లపాటి పద్మనాభ రాజు, ఇళ్ల శ్రీనివాస్, ప్రసాద్, పడాల అబ్బు, బోసు, పాముల శ్రీను, దొంగ పెద్దిరాజు, పాలా ఏడుకొండలు, గెద్దాడ ఏకలవ్య, పైడి ఏసుబాబు, బుడితి భీమారావు, గొట్టుముక్కల రమేష్ తదితరుల పాల్గొన్నారు.



పెనుమంట్ర మండల వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి

కూటమి వైఫల్యాలను ప్రజలకు తెలియజెప్పాలి

పెనుమంట్ర: గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాల ద్వారా కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజెప్పాలని పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ పెనుమంట్ర మండల నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం మంగళవారం మధ్యాహ్నం మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాలమేరకు తూర్పుపాలెం క్యాంపు కార్యాలయంలో మండలపార్టీ అధ్యక్షుడు గూడూరి దేవేంద్రుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం ప్రజలపై కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతోందని అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఏడాది కాలం పూర్తి అయిన ఏఒక్క పథకాన్ని అమలు చేయలేదని మండిపడ్డారు. తప్పుడు ప్రకటనలతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రతి గ్రామంలో రచ్చబండ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి చెప్పాల్సిన బాధ్యత గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల మాజీ అధ్యక్షుడు , మార్టేరు ఉపసర్పంచ్ కర్రి వేణుబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు కర్రి రామలింగేశ్వరరెడ్డి, మండల సర్పంచ్‌ల చాబర్ అధ్యక్షుడు తమనంపూడి వీర్రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఈశ్వరుడు, నరసింహమూర్తి, గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, మాంద్రుశాంత వెంకటేష్, సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక, బుర్రా రవి కుమార్, తాడి రాజారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు దొంగ దుర్గా ప్రసాద్, బహుజన కులాల రాష్ట్ర అధ్యక్షుడు చింతపల్లి గురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దౌర్జన్యాలు పెరిగాయి



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ

నరసాపురం: కూటమి సర్కార్ రాష్ట్రంలో మద్యాన్ని ఏరులై పారిస్తోందని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ అన్నారు. మద్యం మత్తులో మహిళలపై దౌర్జన్యాలు, బాలికలపై అత్యాచారాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక మీరా భవన్‌లో నిర్వహించిన ఐద్వా పట్టణ మహాసభలో ఆమె మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే మద్యాన్ని నియంత్రిస్తామని హామీ ఇచ్చిన కూటమి నేతలు వీధివీధినా బెల్ట్‌షాపులు పెట్టి, మహిళలకు రక్షణ లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మహిళలకు అమలు చేస్తానన్నే పథకాలు అమలు చేయకపోవడంతో గ్రామాల్లో మహిళలు వడ్డీ వ్యాపారుల వద్ద, మైక్రో ఫైనాన్స్ కంపెనీల వద్ద అప్పులు చేస్తున్నారని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికై నా కళ్లు తెరిచి మహిళల బాధలు తీర్చేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం సంఘ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుగా కవురు లక్ష్మి, కోరాడి పార్వతి, సభ్యులుగా సుధారుణీస్, దుర్గాభవానీ ఎన్నికయ్యారు.

సామూహిక మంగళ గౌరీ వ్రతాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న మహిళలు

యలమంచిలి: మండలంలోని గుంపర్రు పంచాయతీ సుంకరపాలెం గ్రామంలో శ్రావణ మాసం మొదటి మంగళవారం సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు మూడో వార్షిక సామూహిక మంగళ గౌరీ వ్రతాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలు గంగానమ్మ, మారెమ్మ అమ్మవార్లకు గ్రామం తరపున పసుపు, కుంకుమ, గాజులు, పూలు, చలివిడి, పానకాల కావడిలు సమర్పించారు. విశ్వహిందూ పరిషత్ మాతృ శక్తి ప్రాంత సంయోజిత తొట్టెంపూడి సునీతదేవి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళలకు సౌభాగ్యాన్ని ప్రసాదించే గౌరీ పూజ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం గ్రామ మాతృ శక్తి మహిళలతో కలిసి మానసాదేవిని ఆవుపాలతో అభిషేకించారు. కార్యక్రమంలో మాతృ శక్తి సభ్యులు టోలీ, విద్యాదేవి, అశ్విని, సాయికళ, అనంతలక్ష్మీ, కనకదుర్గ, జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.

బడ్డీషాపు తొలగించవద్దని వినతి



మునిసిపల్ మేనేజర్ శ్యామలకు వినతిపత్రం అందిస్తున్న పుష్పరాజ్

పాలకొల్లు సెంట్రల్: స్థానిక 27వ వార్డులో రోడ్డుపై చిన్న బడ్డీ పెట్టుకుని జీవనం సాగిస్తున్న దళిత మహిళ బడ్డీ షాపుని తొలగించాలని అధికారులు వేదిస్తున్నారని రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. మంగళవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ మేనేజర్ శ్యామలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుష్పరాజ్ మాట్లాడుతూ సబ్బితి కుమారి అనే మహిళ లజపతి రాయ్‌పేట చాంబర్స్ కళాశాల రోడ్డులో ఓ బడ్డీ పెట్టుకుని జీవనం సాగిస్తుందన్నారు. ఆమె బడ్డీకి పన్ను, కరెంటు బిల్లు కూడా చెల్లిస్తున్నారని అయినా ఆమె బడ్డీని తొలగించాలని మునిసిపల్ అధికారులు ప్రయత్నిస్తున్నారన్నారు. అధికారులు ఈ బడ్డీ తొలగించాలని చూస్తే మాలమహానాడు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఆందోళన చేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో బద్ద ఆనందరావు, పాడపాటి మాణిక్యాలరావు, సబ్బితి పద్మాకరరావు, పి.మధుబాబు, పి.రాంబాబు, బి.అంతర్వేది తదితరులు పాల్గొన్నారు.

వారాహి అమ్మవారికి పంచామృతాభిషేకాలు



మల్లిపూడిలో శ్రీ వారాహి దేవి అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

పెనుమంట్ర: నాగపంచమి పర్వదినం పురస్కరించుకుని మల్లిపూడి గ్రామంలో శ్రీవారాహిదేవి అమ్మవారికి మంగళవారం భక్తులు పంచామృతాభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు గుడిమెట్ల శ్రీనివాసరెడ్డి, మాధవీదంపతులు తొలుత అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం వేద పండితులు వారణాసి రామలింగశాస్త్రి ఆధ్వర్యంలో భక్తులు సామూహిక కుంకుమ అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ప్రతినెలా పంచమి రోజున అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలతో పాటు సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సాయిబాబారెడ్డి తెలిపారు.

భక్తాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో భక్తాంజనేయస్వామి

యలమంచిలి: శ్రావణ మాసం మొదటి మంగళవారం సందర్భంగా స్థానిక మంచినీటి చెరువు గట్టున ఉన్న శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి వెంకట రాజగోపాలకృష్ణ బ్రహ్మత్వంలో ఆంజనేయస్వామికి వట్టి వేరు, బంతి, చామంతి పువ్వులతో పుష్పాభిషేకం, తమలపాకులు, గంగ సింధూరంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెనుగొండ సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారం

పెనుగొండ: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ త్రిసభ్య కమిటీ మంగళవారం ప్రమాణ స్వీకారం చేసింది. కమిటీ చైర్మన్‌గా నక్కా వేద వ్యాస శాస్త్రి, డైరెక్టర్లుగా కానూరి సత్యనారాయణ, వేండ్ర మురళీలు బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యఅతిథిగా ఆచంట శాసన సభ్యుడు పితాని సత్యనారాయణ హాజరై సొసైటీని ఆదర్శ సొసైటీగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి, గుత్తుల లోకేశ్వరరావు, కొండవీటి శ్రీనివాసరావు, గుర్రాల సూరిబాబు పాల్గొన్నారు.

వీధి దీపాలు వెలగకపోవడంతో ఇబ్బందులు

నరసాపురం: స్థానిక 31వ వార్డు నాగారమ్మగుడి కాలువగట్టు ప్రాంతంలో వీధిదీపాలు వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గత రెండేళ్ల నుంచి ఈ ప్రాంతంలో వీధి దీపాల సమస్య ఉంది. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో ఎప్పుడూ వీధిలైట్లు వెలగవని చెబుతున్నారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి వీధిదీపాల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

15న దివ్యాంగులకు పాటల పోటీలు

నరసాపురం: స్థానిక మదర్‌థెరిస్సా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 15న దివ్యాంగుల రాష్ట్రస్థాయి పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రతినిధి రాబర్ట్ తెలిపారు. ఈమేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వలందర్ రేవులో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే పోటీల్లో అన్ని వయస్సుల వారు పాల్గొనవచ్చిని పేర్కొన్నారు. ప్రథమ బహుమతి రూ.5 వేలు నగదు, షీల్డ్, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ 2 వేలు అందిస్తామని వివరించారు. పోటీల్లో పాల్గొనేవారు రూ.200 ఎంట్రీ ఫీజు చెల్లించాలని, ఇతర వివరాలకు 98480 26302 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

నేడు నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నరసాపురం: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. అజెండా ప్రతులు కౌన్సిలర్లకు సకాలంలో అందించామని పేర్కొన్నారు. సభ్యులు విధిగా హాజరుకావాలని సూచించారు.